
# నిజాయితీ నీడలో

— యం.వి.యం

'నీతిశతకం' అంటే ఏమిటి తాతయ్యా? అమాయకంగా అడిగిన అయిదేళ్ళ అరుణ్ వైపు చూపులతో సమాధానం చెప్పలేనట్లు చూశారు- గోపాలంగారు. ఆ ప్రశ్నకి సమాధానం దొరకని ఈ చిన్నారి మనసుకు ఏమని చెప్పాలి? ఎలా ఖదులివ్వాలి? వాడి లేత మనసుకి ఏం చెప్పినా ఎలా చెప్పినా ప్రమాదమే.



వాడు చదివే ఇంగ్లీషు బడిలో సమాధానాలన్నీ సే- 'ఎస్' ఆర్ 'నో' 'ట్రూ' ఆర్ 'ఫాల్స్' అనే ధోరణిలో టూకీగా 'టాకీ'గా ఉంటాయి, మరి- వాడిప్పుడు వేసిన ప్రశ్నకి అంత టూకీగా సమాధానం చెప్పడం తన వల్లవుతుందా? ఒక్కమాటలో సమాధానం చెప్పలేని చిక్కు ప్రశ్న అది. అధవా- చెప్పాలని సాహసం చేసినా- తెలుగు భాషలో తేనెలొలుకు మృదుకోమల భాష్యంతో చెప్పినా- ఓ- నా- మాలకు బదులు ఎ.బి.సి.డీ..లు దిద్దిన ఆ చిన్నారి మనసుకు అద్దేలా చెప్పడం తనవరకూ దుస్సాహమే అవుతుంది.

